క్లుప్తంగా

23న ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ ఇంటర్వ్యూ

కాచిగూడ: ఐటీఐలో ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, వెల్డర్స్, మెషినిస్ట్, టర్నర్స్ కోర్సులు పూర్తిచేసిన వారికి అప్రెంటీస్‌లో ఈనెల 23న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వాషింగ్ మెషిన్ కంపెనీ రిసాజెట్ ప్రైవేట్ లిమిటెడ్ రిక్రూటర్ కిరణ్‌తేజ తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్ రూ.10,000లతో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.1500 ఇస్తుందన్నారు. సబ్సిడీతో కూడిన బస్‌పాస్, క్యాంటీన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటా, సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, 4 పాస్ ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, ఫ్యాబ్‌సిటీలోని రిసాజెట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ 7989995685.

'మైనార్టీలపై అనుసరిస్తున్న తీరు బాధాకరం'



పుస్తక పరిచయ వేదికలో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మైనార్టీల విషయంలో బీజేపీ అనుసరిస్తున్న తీరు బాధాకరమని ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన రచించిన క్రూకెడ్ టెండర్ ఆఫ్ న్యూ ఇండియా పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీలో బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా టికెట్టు ఇవ్వలేదన్నారు. కర్నాటకలో కూడా అదే జరిగిందని, కేంద్రమంత్రి మండలిలో కూడా ఒక్క ముస్లిం వ్యక్తి కూడా లేడని విమర్శించారు. అందరికీ సమాన హక్కులు, అవకాశాలు, గౌరవం ఉండాలని కోరారు. ప్రొఫెసర్ ఈ.తిరుమలి, ఎస్.వినయ్ కుమార్, సీఐటీయూ నాయకులు కె.వీరయ్య తదితరులున్నారు.

ఫైరింగ్ రేంజ్‌ను తరలించాలని ధర్నా



ధర్నాచౌక్ వద్ద ధర్నాలో ఫెబల్‌సిటీ పీరంచెరువు ప్రాంత వాసులు

ముషీరాబాద్: తెలంగాణ, ఆంధ్ర ఉప ప్రాంతంలో టాసా సిబ్బంది చేపడుతున్న నిరంతర ఆర్మీ ఫైరింగ్ ప్రాక్టీస్ వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యానికి గురవుతున్నామని రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం ఫెబల్‌సిటీ పీరంచెరువు ప్రాంత వాసులు మురళీమోహన్, కిరణ్‌కుమార్, వసంతరావులు అన్నారు. ఈ ప్రాక్టీస్ సెంటర్‌ను తక్షణమే తరలించాలని వారు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో శాంతియుత ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. నివాస ప్రాంతాలకు దగ్గరలో మూసీ ఫైరింగ్ రేంజ్ ఉండటంతో తెలంగాణ, ఆంధ్ర సబ్ డివిజన్ ఏరియా ద్వారా నిర్విరామంగా ఫైరింగ్ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల స్థానికులకు శబ్ద కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఉత్తరప్రదేశ్, సాహారన్‌పూర్ నగర్ ఎమ్మెల్యే రాజీవ్ గుమార్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ జాతీయ అధిష్ఠానం సూచన మేరకు ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో డాక్టర్ ఎన్.గౌతంరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు శ్యామ్‌రాజ్, గోలి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందకిషోర్‌యాదవ్, కృష్ణాగౌడ్, కార్పొరేటర్లు వై.అమృత, పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమా రమేష్‌యాదవ్, వనం రమేష్ తదితరులున్నారు.

ఓటు నమోదుపై అవగాహన

కాచిగూడ: ఓటుహక్కుపై కాచిగూడలో కాంగ్రెస్ పార్టీ నేతలు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేత, బీ– బ్లాక్ అధ్యక్షుడు హెచ్. హరితిలక్‌సింగ్ సూచించారు. ఓటుహక్కు లేనివారు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటరు నమోదుకోసం దరఖాస్తు ఫామ్‌లను ఆయన అందజేశారు. పార్టీ నేతలు టిల్లు, శ్రీనివాస్, రమేష్ తదితరులున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

ముషీరాబాద్: దేశంలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదేనని టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా రాంనగర్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని మహాత్మగాంధీ అన్న మాటలను రాజీవ్ గాంధీ నిజం చేశారన్నారు. రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వహక్కులు, అధికారాలు కల్పించారని తెలిపారు.

- మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, శ్రీరాములయాదగిరి, జీ.ఎస్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, నాగేంద్ర, సమద్, అబ్దుల్, చారీ, రామకృష్ణ, దశరథ్, తేజాగౌడ్, దినేష్ జల్లా, జగదీష్, చిన్న, నెల్సన్ తదితరులున్నారు.
- ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని రెయిన్‌బో హోమ్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిజ్జి శత్రు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల శ్రీకాంత్, ఖదీర్, రాము, వేణు, రజనీ, వర్ధన్ తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, అభిషేక్‌రెడ్డి

- గోల్డెన్‌క్రాన్ చౌరస్తాలో పట్నం నాగభూషణంగౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. అనిల్‌కుమార్‌యాదవ్, మురళీ మోజెస్, రమేష్, వెంకన్న, బాబు, నర్సింహ్మారెడ్డి, మహమ్మద్‌గౌస్, స్వరూప తదితరులున్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కు వద్ద రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పర్వతాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్, వై.శ్రీనివాస్, రాజు, రాములు, ప్రసాద్, రఘురామ్, అంజి తదితరులున్నారు.



ఫీవర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మోతే రోహిత్

రోగులకు పండ్లు పంపిణీ..

నల్లకుంట: నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రిలో యూత్‌కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నేతలు కోటం అనిల్, హాజీ అలీ, మోజీ, నర్సింగ్, వసీమ్ తదితరులున్నారు.



అన్నదాన కార్యక్రమంలో..



గోల్డెన్‌క్రాన్ చౌరస్తాలో..



సుందరయ్య పార్కు వద్ద..

సొంతింటి కల సాకారం చేసేందుకే 'గృహలక్ష్మి'

ముషీరాబాద్: నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు గృహలక్ష్మి పథకం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ డీఎస్‌నగర్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పేద ప్రజల నుంచి గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొంతస్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారికి రూ.3 లక్షలు వందశాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇళ్లు ఉండేలా సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. డీఎస్ నగర్‌లో ఉండే పేదలకు తప్పనిసరి ఈ పథకం వర్తింపజేసి వారి సొంతింటి కలను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో కమ్యూనిటీహాల్‌ను కట్టించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ముచ్చకుర్తి ప్రభాకర్, సాయి, గోరఖ్‌నాథ్, జునేద్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్‌నగర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ప్రొ. సూరేపల్లి సుజాతకు జయశంకర్ పురస్కారం



పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నగ్నముని తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దిగంబర కవి నగ్నముని మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి పోరాటంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రముఖమైందన్నారు. అలాంటి ఉద్యమానికి కేంద్ర బిందువైన జయశంకర్ పేరిట నిబద్ధత కలిగిన ఉద్యమకారుడికి పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర రచయితల వేదిక మాజీ అధ్యక్షుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ.. అణగారిన ప్రజలను జాగృతి చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న సూరేపల్లి సుజాతకు ఈ అవార్డు ఇవ్వడం హర్షనీయమన్నారు. రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, పురస్కార దాత దేవరకొండ కాళీదాస్, సీ.వీ.కుమార్ తదితరులున్నారు.

'సాగర కెరటాలు' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ కదారు అనసూయ రచించిన 'సాగర కెరటాలు' పుస్తకాన్ని అమృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మార్పులు తీసుకొచ్చే ఇలాంటి పుస్తకాలను తీసుకురావడం అభినందనీయమన్నారు. డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి ఎం.నర్సింహ్మప్ప, డాక్టర్ జల్దీ విద్యాసాగర్ రావు, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, డాక్టర్ యశోద పెనుబాల, కవిత్రి మంజులసూర్య తదితరులున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

నర్సింగ్‌రావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న గౌతంరావు, బీజేపీ నేతలు

అంబర్‌పేట: దివంగత బీజేపీ నేత సింగితం నర్సింగ్‌రావు బీజేపీ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. ఆదివారం గోల్నాక డీమార్ట్ చౌరస్తాలో నర్సింగ్‌రావు 5వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆ పార్టీ నేతలతో నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కన్నె రమేష్ యాదవ్, అజయ్‌కుమార్, మూల రవీందర్‌గౌడ్, నాగభూషణంచారి, ఎస్. రాజేష్, ఈశ్వర్, రాంచందర్, శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

కాచిగూడ: మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి తన్నీరు హరీష్‌రావు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలను కలిసిన ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ.. కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాములు, కటికం మహేష్, వెంపటి సోమన్న, అరికెల సుధా, రామిని సందీప్, మన్నె వెంకటేష్, బత్తుల శ్రీనివాస్, పత్తి అనిల్‌కుమార్, రంజిత్‌కుమార్, దశరథ్, ప్రమోద్ తదితరులుపాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉగ్గే శ్రీనివాస్‌పటేల్

చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇప్పించాలి



నృత్యకళాకారులతో శ్రీనివాస్, నిర్వాహకులు

చిక్కడపల్లి: చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇప్పించాలని అభినవ సుందరదాసు ఎంఎస్ రామారావు మెమోరియల్, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో నటరాజ నాట్యనీరాజనం పేరిట త్యాగరాయగానసభలో నృత్యప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులకు జ్ఞాపికలు బహూకరించిన డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చదువుతోపాటు చిన్నారులకు నాట్యంపై మక్కువను పెంచి వారికి శిక్షణను ఇప్పించాలన్నారు. దాదాపు 200మంది చిన్నారులు పాల్గొని శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించి ఆహుతులను ఆకట్టున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే దాకా పోరు

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని రెండవ ఏఎన్‌ఎంల యూనియన్(ఏఐటీయూసీ) స్పష్టం చేసింది. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని యూనియన్ కౌన్సిల్ సమావేశాన్ని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు నరసింహ మాట్లాడుతూ... పలు రాష్ట్రాల్లో ఎన్‌హెచ్ఎం స్కీమ్ కింద పనిచేసే వారిని పర్మినెంట్ చేశారనే విషయాన్ని డి.హెచ్.శ్రీనివాస్ దృష్టికి పలుమార్లు తీసికెళ్లామన్నారు. 20 సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారని, వీరి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. వీరి సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాలు ఆపేది లేదని, సమ్మెను కొనసాగిస్తూనే ఉంటామన్నారు. నేటి నుంచి అన్ని జిల్లాల్లో వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, దీనికి సెకండ్ ఏఎన్‌ఎంలు హాజరై విజయంతం చేయాలని నాయకులు తోట రామాంజనేయులు,విజయ కుమారి పిలుపునిచ్చారు.

లోకేష్‌యాదవ్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చరిత్ర విభాగం విద్యార్థి లోకేష్‌యాదవ్‌కు డాక్టరేట్ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కల్చర్ అండ్ టూరిజం ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై పరిశోధన పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వైరా మండలం, సిరిపురం(కేజీ) గ్రామం రైతు కుటుంబానికి చెందిన గంగదేవుల నరసయ్య, ఆదిలక్ష్మీ దంపతుల కుమారుడు లోకేష్ ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసి ఓయూలో పీజీ చదువుతు తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకుడిగా కీలక పాత్ర పోషించారు.

దయానంద ఉత్సవాల కమిటీ సభ్యుడిగా ఓయూ అధ్యాపకుడు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్య సమాజ్ మందిర్ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల కమిటీ సభ్యుడిగా డాక్టర్ ధర్మతేజ నియమితులయ్యారు. ప్రధాని చైర్మన్‌గా 97 మంది సభ్యులలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రాంతీయ ప్రతినిధిగా కొనసాగుతున్న ఓయూ బీఈడీ కాలేజీ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ధర్మతేజ నియామకం పట్ల నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులోని సిరి సంపద రెసిడెన్సీ పరిసరాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్‌లు చెప్పారు. ఆదివారం ఈ మేరకు అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు పలు సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో స్థానికేతరులు తమ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారన్నారు. నాలా నిర్మాణ పనులు పూర్తయినందున వెంటనే రోడ్డు నిర్మాణ పనులు కూడా పూర్తి చేయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి శ్రీనాథ్, రమేష్, రితేష్, రమేష్‌నాయుడు, బాలకృష్ణారెడ్డి, హర్ష, అశ్విన్, మోహన్, ప్రశాంత్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వాసులతో అంబర్‌పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సామాజిక భవనాల ఏర్పాటు, వాటిలో మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే రూ.6 లక్షల సొంత నిధులతో మరమ్మత్తులు, సౌకర్యాలు కల్పించారు. స్థానిక బస్తీపెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి బస్తీ ప్రజలకు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక భవనాలను సరైన తీరుతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాములుముదిరాజ్, ఎర్రబోలు నర్సింహ్మారెడ్డి, అఫ్రోజ్, దిలీప్‌రాజ్, బాల్‌రాజ్, మీరియాల రవీందర్, బస్తీపెద్దలు రవి, రాజు, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 60 శాతం సీట్లు కేటాయించాలి

అంబర్‌పేట: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 60 శాతం సీట్లు కేటాయించాలని తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం అంబర్‌పేట మహాత్మా జ్యోతిరావు పూలే చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. సంఘం నాయకులు వేణుగోపాలాచారి, దుర్గాప్రసాద్, భరత్‌ముదిరాజ్, నందు, సంజీవచారి, లక్ష్మణ్‌గౌడ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జొర్రిగల శ్రీధర్ తదితరులు

బీమా రంగంలో ఉత్తమ అవకాశాలు



మాట్లాడుతున్న పీ.వీ.రమణకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీమా రంగంలో రాణించడానికి ఉత్తమ అవకాశాలు ఉన్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి పీ.వీ.రమణకుమార్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో బీమా రంగంలో అవకాశాలపై ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ.. ఎంబీఏ గ్రాడ్యుయేట్స్‌కు బీమా రంగంలో ఉన్న సవాళ్లు, అవకాశాల గురించి వివరించారు. బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రాంతీయ మేనేజర్ కిషోర్‌రెడ్డి, శ్యామలదేవి, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో మాలలకు అన్ని రాజకీయపార్టీలు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఏ రాజకీయపార్టీ కూడా మాలలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్క ఎంపీ లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన మాలలకు వచ్చే ఎన్నికల్లో అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలని లేదంటే తమ వర్గం నుంచి ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. మాల మహానాడు జాతీయ సలహాదారు రాజలింగం, మల్లెల వెంకట్‌రావు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, జాతీయ కార్యదర్శి నర్సింగ్‌రావు, శ్రావణ్‌కుమార్, మన్నె శ్రీధర్‌రావు, రాందాస్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్‌బాబు

ఘనంగా గంగమ్మతల్లి తెప్పోత్సవం



గంగపుత్ర తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: గంగపుత్రుల తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో గంగమ్మ తల్లికి వైభవంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, పోతరాజుల నృత్యాలతో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరైయ్యారు. గంగపుత్ర సంఘం నాయకులు గడ్డం సాయికిరణ్, సాయి, బాబి తదితరులున్నారు.



శోభయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అరుంధతినగర్‌లో శోభాయాత్ర ప్రారంభం ..

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో డివిజన్ అరుంధతినగర్ బస్తీ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగతెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. తెప్పోత్సవ శోభాయాత్రను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు కైరంకొండ నర్సింగ్, ప్రకాష్, పూస రాజు, నవీన్, చందు, భారతి, లలిత, సుప్రియ తదితరులున్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ విజ్ఞాన దర్శిని రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ జేఏసీ, మూఢ నమ్మకాల నిర్మూలన చట్టసాధన సమితి సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ నరేంద్ర దబోల్కర్ 10వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దబోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మంత్రాలు, చేతబడుల పేరుతో హత్యలు చేయడం, సజీవదహనం, నాలుకలు కత్తిరించడం వంటి దారుణాలు రాష్ట్రంలో ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అంధ్ర శ్రద్ధ నిర్మూలన సమితిని నెలకొల్పి మూఢ నమ్మకాల నిర్మూళనకు పాటుపడిన ప్రజావైద్యుడు డాక్టర్ నరేంద్ర దబోల్కర్‌ను హత్య చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇలాంటి చర్యలను నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. స్వేచ్ఛ జేఏసీ కో– కన్వీనర్లు గుత్తా జ్యోత్స్న, పి.శంకర్, తుమ్మభాస్కర్, ఆదమ్‌రాజు, జ్యోతి, ప్రదీప్, మిమిక్రీ శ్రీనివాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని రమేష్